# రైలుబండిలో

శ్రీమతి వి. లక్ష్మీపార్వతిగారు

"బెజవాడా.. బెజవాడా.. ఆ. ఆ."

"కూలీ - కూలీ - కూలీ - కూలీ కావాలా అండి కూలీ"

అనుచున్న గొడవలో మద్రాసునుండి వచ్చిన రాత్రి 11 గంటల బండి చటుక్కున ఆగింది, బెజవాడ ప్లాట్ ఫారం మీద.

ఇంటరుక్లాసులో పైబల్లమీద పడుకుని ఉన్న మోహన్ కు మెలకువ వచ్చింది. యేదో ఆలోచిస్తూ బండి టాపు కేసి చూచినాడు. అతను 18 సంవత్సరములు వయస్సు కల వాడు. అందమైన మొగము, విశాలమైన నుదురు, తామర పువ్వు రేకులువంటి చక్కటి నేత్రములు, మామడి పండు చాయ, ఏదో ముఖ్యమైన విషయము ఆలోచన చేయు చున్నట్లు కనుబడినాడు. అది వరకు నిద్ర పోతున్న అతడు బండి అకస్మాత్తుగా ఆగేసరికి, చటుక్కున మేలుకున్నాడు. కొంత సేపటికి క్రింది బల్లవంక చూచినాడు. ఒక బల్లమీద ఒక ముసిలి ఆయన శాలువా కప్పుకొని పడుకుని ఉన్నాడు. రెండవ బల్ల కాళీగా ఉన్నది. తన సూటుకేసు సర్గ్గా ఉన్నదో లేదో అని చూచుకొని మళ్లీ పండుకున్నాడు.

ఇంతలో ఎవరో ఆ బండి తలుపు తీశారు. పరుపు కట్టలు, ట్రంకుపెట్టెలు, సూట్కేసులు, గ్రామఫోనుపెట్టె మరచెంబు వగైరా ఆ కంపార్టుమెంటులోకి చేరుతున్నవి. నీలపురంగు జరీబార్డరు పట్టుచీర కట్టుకొని, వాలుజడ, చేతికి రిస్టువాచీలతో అందమైన 15 సంవత్సరముల బాలిక బండిలో ఎక్కి సామానులన్నీ బల్లల క్రింద జాగ్రత్తగా సర్ది పెట్టుచున్నది. ఆమె వెనకాల నల్లటి బుర్ర మీసాల బొర్రబాబు కడు ఎక్కి "సామాను అంతా లెఖ్ఖ పెట్టు కున్నావా సుశీలా" అన్నాడు. ఈ శబ్దముతో శాల్వా ముసుగు పెట్టుకొని పండుకున్న ముసలివాడు ముసుగునుండి తొంగిచూచి, బండి అంతా తన స్వంతంలాగ కోపముతో, లేచి కూర్చుని "ఇది మొగవాళ్ల బండి, ఆడవాళ్లు ఎక్కకూడదు" అన్నాడు. మన బొర్రబాబు మాత్రము తీసి పోతాడా, "ఆడవాళ్ల బండి అయినా సరే మొగవాళ్ల బండి అయినా సరే మేము ఎక్కక మానము" అన్నాడు.

ముసలాయన· "ఇందులో ఆడవాళ్లు ఎక్కకూడదంటే యేమిటయ్యా దౌర్జన్యం చేస్తావు, గార్డుని పిలవమం టావా యేమిటి" అంటూ కంపార్టుమెంటులో పై బల్లమీద పండుకొని ఉన్న మోహన్ కేసి చూచినాడు. తనను సపోర్టు చేస్తాడు కదా అనుకున్నాడు. ఇంత వరకు సుశీల వంకనే చూస్తూ వారిద్దరి తగవులూ వింటూ ఉన్న మోహన్‌కు నవ్వు వచ్చింది.

"యేమండోయి తాతగారూ, వీరెవరో మన నిద్ర పాడు చేయడం నాకూ ఇష్టంలేదు. కాని, రూల్సుప్రకారం ఆడవాళ్లను ఈ బండిలో యెక్కనివ్వకుండా వుండడానికి మనవల్లకాదు. ఆడవాళ్ల బండిలో మగవాళ్లు ఎక్కకూడదు. కాని, మగవాళ్ల బండిలో ఆడవాళ్లు ఎక్కుటకు ఎవరి అభ్యంతరము లేదు.

"వెధవ రైల్వే రూల్సు ఆడవాళ్ల తరఫునే పక్షపాతం వహించాయి. ఆ అమ్మాయిని ఆడవాళ్ల బండిలో కూర్చో బెట్టించటానికి మనకు అధికారం లేదు. పురుషుల బండిలో పురుషులు, స్త్రీలు,పిల్లలు వగైరా అందరూ యెక్కొచ్చు నట. పోనీ, ఆ అమ్మాయి వుంటే మనకేమి అడ్డము లెండి యీ బండిలో" అన్నాడు. సుశీల అతని మాటలకు చిరు నవ్వు నవ్వుతూ అతని వైపు చూస్తూ ఉన్నది.

మన బొర్రబాబు బొడ్డుకొంగు మూట విప్పే సరికి, బండి ప్లాటుఫారం దాటింది. కూలివాళ్లు గోలపెట్టారు. బండి వెళ్లుతూ ఉన్నది.

ముసలాయన, బొర్రబాబు సంభాషణ ప్రారంభించారు. ఆడవాళ్లుంటే నాకేమి అభ్యంతరము లేదు కాని వాళ్లకే కొంచెము ఇబ్బందిగా ఉంటుందేమో అని అన్నాను" అన్నాడు.

# రైలుబండిలో

బొర్రబాబు "యేమి చేయమంటారు బాబుగారూ, ఆడవాళ్ల బండిలో నుంచోటానికైనా చోటులేదండి, పైగా యీ అమ్మాయి మా మనుమరాలు, రాత్రి వేళ వంటరిగా వదిలిపెట్టి ఉండటం ఇష్టం లేదు" అన్నాడు. అయిదు నిమిషాలలో వారిద్దరికీ ఎంతో స్నేహం కలిసింది. బొర్రాయన తన కోటులోపల జేబులోనుంచి రైలు తాళము చెవి తీసి రెండు తలుపులు తాళము వేసి "రైలులో రాత్రులు ఆడవాళ్లతో ప్రయాణము చేసేటప్పుడు, తాళము చెవి ఉంటే మంచిదని మా అబ్బాయి వర్కుషాపులో చేయించి ఇచ్చాడు" అన్నాడు.

సుసీల "తాతయ్యా నాకు నిద్రవస్తూవుంది. పై బల్ల ఖాళీగా ఉన్నది. పండుకుంటాను" అన్నది. బొర్రబాబు పై బల్ల వంకచూచాడు. అది ఖాళీగానే ఉన్నది. యెదర ఉన్న రెండవ బల్లమీద పండుకొన్న మోహన్‌నిచూచి సందేహించినాడు. కాని, తాను పై బల్లమీదికి ఎక్కలేడు గనుక "పోనీ పండుకో అమ్మా" అన్నాడు. అన్నదే తడవుగా సుశీల పై బల్లమీద పక్కవేసుకొని పండుకున్నది. పాపం నిద్రరావటం లేదు—

ముసలాయన: ఏవూరు వెళ్లుతారండి.

బొర్రబాబు: రాజమండ్రి వెళ్లుతాము. మీరెందాకా.

ము: నేనూ రాజమండ్రేనండి. తెల్లవారిపోతుంది రాజమండ్రి చేరేసరికి.

బొ: "అయితే మీదీ రాజమండ్రేనాండీ కాపురం"

ము: ఔను.

బొ: గోపీనాథ్, పబ్లిక్ ప్రాసిక్యూటరుగా ఉన్నారే వారి నెరుగుదురా మీరు.

ము: ఆ, ఆ, ఎరుగుదునండి.

బొ "ఆతను నా పెద్ద కొమారుడు. నా రెండో కుమారుడు రామారావు అసిస్టెంటు ఇంజనీరు. ఈ అమ్మాయి అతని కూతురు. సంబంధం వచ్చింది. పెండ్లికూతురు చూపులకు వస్తారు. అందుకోసం తీసుకు వెళ్లుతున్నా" అంటూ మోహన్‌కేసి మళ్లీ చూచాడు. మోహన్ సుశీల వంక రెప్పవేయక చూస్తున్నాడు. బొర్రాయన ముసలాయనతో "వెధవ రైళ్లలో రాత్రులు ప్రయాణం కష్టమండి" దొంగలు ఉన్నారు జాగ్రత్త అని ప్రతిరైలు పెట్టెలో వ్రాసి పెట్టుతారు. దొంగలను ఎందుకు ఎక్కనించాలి రైలువాళ్లు. మనవంటి పెద్దమనుష్యులను జాగ్రత్తగా ఉండమనడం ఎందుకు? ఈకాలపు దొంగలు పెద్దమనుష్యులులాగే సూట్లు, కోట్లు, వేసుకొని ఇంటరు క్లాసులోను సెకండు క్లాసులోను ప్రయాణముచేస్తూ యే అర్ధరాత్రివేళో మన పెట్టెలు దింపుకుంటారు. మనం మేలుకొనిచూస్తే నిద్ర కళ్లను నా పెట్టె అనుకున్నాను అంటారు. అంటూ సందేహంగా పై బల్ల వైపు చూచాడు. సుశీల నిద్రపోతున్నట్లు కనిపించినది. కాని నిద్రపోలేదు.

12 గంటలైనది. గన్నవరం స్టేషను దాటింది రైలు. తాతగార్లిద్దరు సంభాషించుచుతూ ఉండగానే, కునికి పాట్లొచ్చినాయి, శాల్వాలు ముసుగుపెట్టినారు. "సుశీలా మెలకువగా వుండమ్మా జాగ్రత్త" అన్నాడు బొర్రబాబు. మోహన్‌కు నవ్వొచ్చింది, కాని ఆపుకున్నాడు. క్రిందబల్లలపైన పెద్దలిద్దరు గుర్రు మొదలు పెట్టారు. పాపము మోహన్‌కు నిద్రపట్టటం లేదు. సుశీలను చూచినప్పటినుండి చంచలమైన మనస్సుతో ఆలోచన లోబడి "ఆడబోయిన తీర్థం యెదురైంది. ఇక రాజమండ్రి వెళ్లడం ఎందుకు? పిల్ల బాగానే ఉన్నది, యేలూరులోదిగి పెద్దనాన్నగారితో ఇష్టమేనని చెప్పుతాను." అనుకున్నాడు ఇంతలో తల వైపున ఉన్న దీపం ఆరిపోయినది. స్విచ్చి ఎక్కడ ఉన్నదో ఆలోచనలో కనపడక టార్చిలైటువేసి వెతుకుతున్నాడు. సుశీల నవ్వుతూ "స్విచ్చి ఎదర బల్లమీద వున్నదండీ" అన్నది. "అలాగా దానికోసమే వెదుకుచున్నాను" అన్నాడు.

"మీరు రైలులో ఎప్పుడూ ప్రయాణముచేయలేదు కాబోలు" అన్నది సుశీల. చెయ్యకేమిగాని ఇలాంటి ప్రయాణాలు ఎన్నో చేసాను. ఏదో పరధ్యానములో తొందరగా స్విచ్చి కనిపించలేదు అన్నాడు తమాషాగా.

"ఏవూరు వెళ్లుతారండి" అన్నది సుశీల. ఏలూరు అన్నాడు మోహన్. నవ్వు ఆపుకోలేక పక్కన నవ్వి "మీ రేమి చదువు చున్నారు" అన్నది సుశీల. అతను

పాపము మొహాము చిన్న బుచ్చుకొని "బియ్యేప్యాసయి నాను. యెందుకు నవ్వు తావు" అన్నాడు. ఏమి లేదండీ ఏలూరు స్టేషను దాటిపోయి పావుగంట అయింది" అన్నది సుశీల. "పోనీ భీమడోలులో దిగుతాను వాల్తేరు ప్యాసంజరులో తిరిగి యేలూరు వస్తాను" అన్నాడు. రాజమండ్రి దాకా రారాదాండీ కాకినాడ ప్యాసంజరులో తిరిగి రావచ్చును అన్నది. మోహన్, సుశీల సరసములతో భీమడోలు దాటిపోయింది.

సుశీల : "మీ పేరేమండి"

మోహన్ : "నా పేరు మోహన్, రామారావు అసిస్టెంటు ఇంజనీరు గారి అమ్మాయి సుశీలను పెండ్లి కుమార్తె చూపులకుగాను రాజమండ్రి వెళ్లుచున్నాను" అన్నాడు. సుశీల అతని వంక చూచి సిగ్గుతో తలవంచుకున్నది.

ఇంతలో బ్రాబాబు మెలకువ వచ్చి ముసుగునుండి పై బల్లవంక చూచినాడు. మోహన్, సుశీల ఇద్దరుకనుపించ లేదు. సుశీల ఏమయినదో అని నిద్ర కళ్లు నులుపుకొంటూ గుండె దడదడకొట్టుకొంటూ ఉండగా చటుక్కునలేచి కూర్చొని సుశీలా, సుశీలా, అంటూ పిలిచాడు. సుశీల నవ్వుతూ "ఎందుకు తాతయ్యా" అన్నది. నీ ప్రక్కన కూర్చున్నది ఎవరు? అన్నాడు. పెండ్లికుమారుడు మోహన్ తాతయ్యా అన్నది. తాతయ్యకూడా నవ్వుకుంటూ వధూవరులు రైలులోనే సమావేశమైనారే అన్నాడు.

★



భార్యయన్న భరింపబడునది,
భర్తయన్న భరించువాడని—
పంతులెన్నడో నొడివెబడి, నిం
దెవరు భర్తో, యెవరు భార్యో
ఎఱుకగలిగిన గఱువలుంటే
ఇంత చెప్పెదరా?